## రైతు కష్టం.. వర్షార్పణం



ఈకబురు,ఆదిలాబాద్ వ్యవసాయం, జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో రైతన్నకు తీరని దుఃఖాన్ని మిగుల్చుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మార్కెట్ యార్డులో ఆరబోసిన జొన్న పంట, జొన్న సంచులు మొత్తం తడిసిపోయాయి. కొంత మంది రైతుల జొన్నలు వర్షంలో కొట్టుకుపోయాయి. నిర్మల్ జిల్లాలోని భైంసా, ముథోల్, కుంటాల, లోకేశ్వరం, లక్ష్మణచాంద, మామడ, సోన్ మండలాల్లో.. వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. జగిత్యాల జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జగిత్యాల, మెట్పల్లి, కోరుట్ల, సారంగాపూర్, రాయికల్, ధర్మపురి, పెగడపల్లి, మల్యాల, కొడిమ్యాల, మల్లాపూర్, మేడిపల్లి తదితర మండలాల్లో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్నలు, పసుపు తదితర పంట ఉత్పత్తులు తడిసి ముద్దయ్యాయి. ఈదురుగాలులకు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. ధాన్యం సేకరణ ఆలస్యం కావడం, తూకం వేసిన బస్తాలు తరలించకపోవడంతో ఆందోళన చెందుతున్న రైతులకు వర్షం మరింత నష్టాన్ని మిగిల్చింది.

## తమిళనాడు ప్రజలు టీవీకేకు ఇచ్చిన తీర్పును గవర్నర్ అగౌరవపరుస్తున్నారు

ఈకబురు,హైద్రాబాద్ మే 7 :
ప్రజాతీర్పును గౌరవించి తీరాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ 108 స్థానాలు గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం దురదృష్టకరం. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేట్లు ఉంది గవర్నర్ తీసుకుంటున్న నిర్ణయాలు ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయని అనుమానాలు కలుగుతున్నాయిసింగిల్ లార్జెస్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్, బొమ్మై కేసు సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయి. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా లేక రాజ్యాంగానికి వ్యతిరేఖంగా ప్రవర్తించాలని ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారా? తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోంది 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన మార్పును అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోంది. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. గవర్నర్ కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు కుట్ర రాజకీయాల్లో భాగమే విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టిచేతులతో తిరిగిరావడం చూస్తే గవర్నర్ రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామమాత్రమే విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం అని విమర్శించారు. కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ.గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదం అని అన్నారు.

## పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్




ఈకబురు,హైదరాబాద్: అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా.. పదేళ్లలో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ముంబయిలో గురువారం నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై మంత్రి ప్రసంగించారు. ''2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టాం. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా.. వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్'ను సిద్ధం చేస్తున్నాం. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి'' అని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాస్కామ్ ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనా మనుషుల ప్రాణాలు తీస్తే.. కాంగ్రెస్ రైతుల ఉసురు తీస్తోంది

**హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు**

మీ స్పందన, సూర్యాపేట ;
సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి.. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. కరోనా వైరస్ మనుషుల ప్రాణాలు తీస్తే.. ఈ కాంగ్రెస్ పాలన రైతుల ఉసురు తీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి తీరు 'బాత్ కరోడో మే.. కామ్ పకోడో మే' అన్నట్లుగా తయారైందని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్.. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందరినీ నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన వాగ్దానాలు తుంగలో తొక్కడమే కాకుండా.. గతంలో కేసీఆర్ అందించిన పథకాలను కూడా రేవంత్ రెడ్డి నిలిపివేశారని విమర్శించారు. ఎస్సీ.. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లుతున్నాయని.. ఈ రెండున్నరేళ్లలో కార్పొరేషన్ల ద్వారా ఒక్క రూపాయి లబ్ధి కూడా జరగలేదని దుయ్యబట్టారు.వ్యవసాయ రంగంలో కేసీఆర్ తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను గుర్తు చేస్తూ హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి కోదాడకు ఏనాడైనా గోదావరి జలాలు తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఎస్సారెస్పీ ఫేజ్ 2 పూర్తి చేసి ఈ ప్రాంత పొలాలకు సాగునీరు అందించామని స్పష్టం చేశారు. కరోనా కష్టకాలంలో హమాలీల కొరత ఉన్నా.. బీహార్ నుంచి ప్రత్యేక రైళ్లలో కూలీలను రప్పించి మరీ రైతుల ధాన్యాన్ని సేకరించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. 93 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొన్న చరిత్ర తమదని.. ఈ ఏడాది 90 లక్షల టన్నులు కొంటామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ఇప్పటివరకు కనీసం 17 లక్షల టన్నులు కూడా కొనలేదని ఎండగట్టారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఘాటు విమర్శలు చేస్తూ.. కోదాడ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ ఓడిపోయినా నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నారని ప్రశంసించారు. గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మాత్రం కేవలం ఆన్లైన్ కే పరిమితమయ్యారని విమర్శించారు. రైతులు కష్టాల్లో ఉంటే పట్టించుకోకుండా ముఖ్యమంత్రి అస్తమానం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని.. ఏసీ గదులు వదిలి కల్లాల వద్దకు రావాలని డిమాండ్ చేశారు.

# నాణ్యమైన విద్యలో... తెలంగాణ వెనుకబాటు



అలాగే విద్యార్థుల నమోదు రికార్డు స్థాయిలో ఉంది. 2014-15 విద్యాసంవత్సరంలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నతస్థాయి పాఠశాలల వరకు విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 87.93 శాతం ఉండగా 2024-25 నాటికి అది 111.6 శాతానికి చేరింది. అలాగే మాధ్యమిక స్థాయిలో విద్యార్థుల నమోదు 76.7 శాతం నుంచి 99.9 శాతానికి పెరిగింది. దేశంలోనే అత్యధిక మాధ్యమిక నమోదు గల రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. ప్రధానంగా 8వ తరగతి తర్వాత డ్రాపౌట్ల సంఖ్య భారీగా తగ్గింది. రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు తగినన్ని ఉండటంతో విద్యార్థులు వాటిపైపు ఆకర్షితులవుతున్నారు. దీంతో విద్యార్థుల నమోదు సంతృప్తికరంగా ఉందని నీతి అయోగ్ అభిప్రాయపడింది.

కానీ బోధన, అభ్యసన కార్యక్రమాల్లో మాత్రం పెద్దగా పురోగతి లేదని పేర్కొంది. ప్రధానంగా బోధనలో నాణ్యత లోపించడం, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థులు అత్యంత వెనుకబడి ఉండటం, ప్రాథమిక అభ్యసన, అవగాహన తీవ్ర ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 9వ తరగతి పరీక్షల్లో విద్యార్థుల గణితం, సైన్స్ ఫలితాలు జాతీయ సగటు కంటే తక్కువగా నమోదయ్యాయి. లాంగ్వేజెస్‌లో జాతీయ సగటుతో సమానంగా ఉన్నప్పటికీ గణితం, సైన్స్, సోషల్‌లో రాష్ట్రం వెనుకబడి ఉంది.

'నాస్'2017-21 గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రంలో అభ్యసన క్షీణత స్పష్టంగా కనిపిస్తోంది. 5వ తరగతిలో లాంగ్వేజెస్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రతిభ పతన స్థాయిలో ఉంది. 8వ తరగతిలో అన్ని సబ్జెక్టుల్లో మార్కులు భారీగా తగ్గాయి. కరోనా తర్వాత పాఠశాలలు, విద్యార్థుల తీరు ఇంకా కోలుకోలేదని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. 3వ తరగతి నుంచి 5వ తరగతి ఫౌండేషనల్ లిటరసీ నుంచి కాన్సెప్ట్యువల్ లెర్నింగ్‌కి మారే దశలో లెర్నింగ్ గ్యాప్స్ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లుతుండటంతో..
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల వ్యవస్థలో నిర్మాణాత్మక సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నట్లు నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రంలో 2,245 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేరని.. అయినప్పటికీ వాటిలో 1,016 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని వివరించింది. 5,001 సింగిల్ టీచర్ స్కూళ్లలో 62 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జనాభా మార్పులు, ప్రైవేటు పాఠశాలల వైపు తల్లిదండ్రుల మొగ్గు, ప్రభుత్వ పాఠశాలలపై విశ్వసనీయత లోపిస్తుండటం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు నివేదిక విశ్లేషించింది. రాష్ట్రంలో మొత్తం 43,154 పాఠశాలలు ఉన్నప్పటికీ వాటిలో అధిక సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలే ఉండటం మరో ప్రధాన సమస్య అని నీతి ఆయోగ్ గుర్తించింది. కేవలం 974 పాఠశాలలే 1 నుంచి 12 వరకు ఇంటిగ్రేటెడ్/కాంపోజిట్ స్కూల్స్‌గా ఉన్నాయని తెలిపింది. దీనివల్ల విద్యార్థులు తరచూ స్కూళ్లు మారాల్సి వస్తోందని.. ఇది భవిష్యత్తులో డ్రాపౌట్లకు దారితీసే ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని హెచ్చరించింది.

బాలికల విద్యలో ముందంజ
నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. ఆడపిల్లల చదువుల విషయంలో రాష్ట్రం అత్యుత్తమ పనితీరు కనబరుస్తోంది. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రాథమిక స్థాయిలో బాలికల జీఈఆర్ జాతీయ స్థాయిలో సత్తా చాటుతూ 115.6 శాతంగా నమోదైంది. ప్రాథమికోన్నత స్థాయిలో బాలికల నమోదు పదేళ్లలో 88.91 శాతం నుంచి 113.4 శాతానికి ఎగబాకింది. సెకండరీ స్థాయిలో 78.58 శాతం నుంచి 101.5 శాతానికి చేరి 100 మార్కును దాటేసింది. హయ్యర్ సెకండరీలో బాలికల నమోదు 49.58 శాతం నుంచి 71.3 శాతానికి చేరుకుంది.

**దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్లు అంతంతే..**

వీల్‌చైర్ తదితర సదుపాయాల కోసం ర్యాంపుల ఏర్పాటులో రాష్ట్రం 28.3 శాతం నుంచి 76.7 శాతానికి ఎగబాకిందని నీతి ఆయోగ్ పేర్కొంది. కానీ దివ్యాంగులకు ప్రత్యేకంగా వినియోగపడే మరుగుదొడ్లు కేవలం 6.8 శాతం బడుల్లోనే ఉన్నాయని తెలిపింది. అయితే పదేళ్ల కిందట ఇది 2.7 శాతంగా ఉండేదని వివరించింది.

రాష్ట్రానికి నీతి ఆయోగ్ కీలక సిఫార్సులు..
- భవిష్యత్తులో తెలంగాణ విద్యావ్యవస్థ రెసిడెన్షియల్, సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ దిశగా ముందుకు సాగాలి.
- ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీపై మరింత దృష్టి పెట్టాలి.
- కాంపిటెన్సీ బేస్డ్ లెర్నింగ్ అమలు చేయాలి.
- టీచర్ ట్రైనింగ్‌ను ఆధునీకరించాలి.
- ఏఐ ఆధారిత లెర్నింగ్ టూల్స్ వినియోగాన్ని పెంచాలి.

# విజయ్‌కి 'మెజార్టీ' తిప్పలు



**విజయ్‌కు అనుమతి ఇవ్వాలి..**
ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తంచేసింది.

**సీఎం కాన్వాయ్ వద్దు: విజయ్**
ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు.
తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది. అలాగే ఆయన ఇంటి వద్ద కూడా భద్రతను పెంచింది. కాగా.. గవర్నర్ వద్దకు వెళ్లేటప్పుడు విజయ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**గతంలో జరిగిన కొన్ని మెజార్టీ తిప్పలు ....**
తమిళనాట రాజకీయ అనిశ్చితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. స్పష్టమైన మెజార్టీ లేక తిప్పలు పడుతోంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అయితే, గతంలోనూ పలు రాష్ట్రాల్లో హంగ్ వచ్చినప్పుడు. గవర్నర్ ఆదేశాలతో మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాలున్నాయి.రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఒకవేళ హంగ్ ఏర్పడితే.. గవర్నర్ తన విచక్షణ మేరకు వ్యవహరించి సరైన అభ్యర్థిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. అలా గత దశాబ్దంన్నర కాలంలో ఐదు రాష్ట్రాల్లో ఇలాంటి మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. అవేంటో ఓసారి చూద్దాం..!

**భాజపా-శివసేన బంధానికి బ్రేక్..**
ఇటీవలి ఏళ్లలో ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నదంటే మహారాష్ట్రలోనే..! 2019లో దాదాపు 34 రోజుల పాటు అక్కడ హైడ్రామా నడిచింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై వచ్చిన విభేదాల కారణంగా దశాబ్దాల నాటి భాజపాశివసేన కూటమి విచ్ఛిన్నమైంది. అనంతరం అప్పటి అవిభజిత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ పవార్.. తన చిన్నాన్న శరద్ పవార్‌తో విభేదించి భాజపాతో చేతులు కలిపారు. అజిత్ వర్గం మద్దతు తీసుకుని ప్రభుత్వ ఏర్పాటుకు భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ముందుకొచ్చారు. గవర్నర్ ఇందుకు సమ్మతించడంతో ఆ ఏడాది నవంబరు 23న ఫడణవీస్ సీఎంగా.. అజిత్ డిప్యూటీగా ప్రమాణం చేశారు. కానీ, ఈ ప్రభుత్వం మూడు రోజులకే కుప్పకూలింది. వ్యక్తిగత కారణాలతో భాజపాకు గుడ్‌బై చెప్పిన అజిత్ పవార్.. తిరిగి శరద్ పవార్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అనూహ్యంగా కాంగ్రెస్, నాటి అవిభజిత శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసి 'మహా వికాస్ అఘాడీ'గా ఏర్పడ్డాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఈ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 288 శాసనసభ స్థానాలున్న ఆ ఎన్నికల్లో భాజపాకు 105, శివసేనకు 56, ఎన్సీపీకి 54, కాంగ్రెస్‌కు 44 సీట్లు వచ్చాయి.

**3 రోజులకే కూలిన ప్రభుత్వం..**
2018లో దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో మొత్తం 222 శాసనసభ స్థానాలుండగా.. ఆ ఎన్నికల్లో భాజపా 104 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 80, జేడీఎస్‌కు 37 సీట్లు దక్కాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 113 సీట్ల మెజార్టీ మార్క్ ఎవరికీ రాలేదు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ నాటి గవర్నర్ వాజూభాయ్ వాలా.. భాజపా నేత యడియూరప్పను ఆహ్వానించారు. ఫలితంగా ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో బలపరీక్ష అనివార్యమైంది. భాజపాకు సంఖ్యాబలం లేకపోవడంతో విశ్వాసపరీక్షకు వెళ్లకుండానే మూడు రోజులకే యడియూరప్ప ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం కాంగ్రెస్, జేడీఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి.

**కాంగ్రెస్‌కు షాక్..**
గోవాలో 40 శాసనసభ స్థానాలుండగా.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. కాంగ్రెస్ 17, భాజపా 13 సీట్లు గెలుచుకున్నాయి. అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానిస్తారని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా నాటి గవర్నర్ మృదులా సిన్హా.. భాజపా నేత మనోహర్ పారికర్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించగా.. చిన్న పార్టీల మద్దతుతో నాడు భాజపా సర్కారు గట్టెక్కింది.

**అక్కడా మొండి'చేయి'..**
అదే ఏడాది (2017) మణిపూర్‌లో ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ 28, భాజపా 22 సీట్లు గెలుచుకున్నాయి. ఆ సమయంలో చకచకా పావులు కదిపిన భాజపా.. చిన్న పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడింది. మెజార్టీ చూపించడంతో నాటి గవర్నర్ నజ్మా హెప్తుల్లా ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించారు. దీంతో బీరేన్ సింగ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. మణిపూర్‌లో మొత్తం 60 శాసనసభ స్థానాలున్నాయి.

**అనూహ్యంగా ఆప్-కాంగ్రెస్..**
దేశ రాజధాని దిల్లీలో 70 శాసనసభ స్థానాలుండగా.. 2013లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. 31 సీట్లతో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆమ్ ఆద్మీ పార్టీకి 28, కాంగ్రెస్‌కు 8 సీట్లు దక్కాయి. నాడు సంఖ్యాబలం లేకపోవడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు భాజపా ముందుకు రాలేదు. ఆ తర్వాత గవర్నర్.. ఆమ్ ఆద్మీ పార్టీని ఆహ్వానించారు. దీంతో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో మైనార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. నాడు ఆయనకు కాంగ్రెస్ వెలుపలి మద్దతు ప్రకటించింది. అయితే, ఈ ప్రభుత్వం ఎన్నో రోజులు నిలవలేదు. 49 రోజుల తర్వాత కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో దిల్లీలో రాష్ట్రపతి పాలన ఏర్పడింది. ఆ తర్వాత 2015లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది.

# బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలి




"గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు ప్రభుత్వానికి సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది. రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు. గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి... వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం. ప్రజా ప్రతినిధులుఅధికారుల కలయికే ప్రభుత్వం. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత. ఇప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**W-D-WC.. ఇదో సైకిల్**
"అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలి. వచ్చిన ఫిర్యాదులు వందశాతం పరిష్కారం కావాల్సిందే. ఆర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా.. కొందరు పైకి కిందకు ఫైళ్లు తిప్పుతున్నారు... వాటిని తక్షణం పరిష్కరించాలి. ఆర్థికపరమైన ఫిర్యాదుల గురించి కూడా విచారణ చేసి సరైన వాటిని పరిష్కరించాలి. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన కావాలి. సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచనలు చేస్తే సుపరిపాలన అందించినట్టే. డబ్బులు లేవనడం కాదు... సంపద సృష్టికి పని చేయాలి... చేద్దాం. వెల్ఫేర్, డెవలప్మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఓ సైకిల్. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించాం. పీ4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ అంటే నమ్మకాన్ని కల్పించాం. రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని డ్రైవ్ చేయడమనేది గర్వంగా ఉండేది. కాలేజీ రోజుల్లో ఎన్ ఫీల్డ్ డ్రైవ్ చేయడాన్ని గొప్పగా ఫీలయ్యేవాళ్లం. అలాంటి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థను ఏపీకి తెచ్చాం. రూ. 23 లక్షల కోట్ల ఎంఓయూలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల మేర ఉద్యోగాలు వస్తాయి. గ్రీన్ ఎనర్జీతో పాటు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నాం. డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుంది. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నాం. వేసవిలో దేశ ప్రజలను చల్లబరిచే ఏసీలు మన రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చాం."అని సీఎం వివరించారు.

**బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేసే కలెక్టర్లే నోడల్ ఆఫీసర్లు**
"గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసింది. కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్న పరిస్థితి ఉంది. భూముల విషయంలో జీరో ఎర్రర్ రికార్డులు తయారు చేయాలి. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ప్రతీ మూడు నెలలకూ నిర్వహించే కలెక్టర్ల సదస్సు మంత్రులు, అధికారులకు క్వార్టర్లీ పరీక్షలు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదు. పబ్లిక్ రిలేషన్స్ ఎంతో ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యం. లాస్ట్ మైల్ లో ఉండే ఉద్యోగిని కూడా మోటివేట్ చేస్తే అద్భుతంగా పని చేయగలరు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి 0.30 పైసల మేర కొనుగోలు వ్యయం తగ్గించాం. మరో 0.30 పైసలు త్వరలోనే తగ్గిస్తాం... తొలిసారి ట్రూ డౌన్ చేయగలిగాం. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాం... ఆన్ లైన్ లో పన్నులు కట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి టాపర్ల ఫోటోలతో యాడ్ ఇచ్చాం. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చాటి చెప్పాం. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్, ఆక్వా కల్చర్ దిశగా అడుగులు వేస్తున్నాం. అన్ని రంగాల్లో... అన్ని వ్యవస్థల్లో ఏపీ పనితీరు బెంచ్ మార్క్ గా మారాలి. జిల్లాలు, కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్ధతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు చేస్తాం... ఆ కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతాం. సీయింగ్ ఇజ్ బిలీఫ్ అనే విధానంలో 3 రోజుల కార్యదర్శులు, 6 రోజులు హెచ్వోడీలు, 8 రోజులు కలెక్టర్లు ఫీల్డ్ కు వెళ్లాలి. సామాజిక మాధ్యమాలను సక్రమంగా వినియోగించుకోవాలి. రిజల్ట్ ఓరియేంటేషనుతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్.. దీన్ని గుర్తు పెట్టుకోవాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఈజ్ నాట్ స్లోగన్... గవర్నెన్స్ డిసైడ్స్ ద స్పీడ్ ఆఫ్ గ్రోత్. ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్.. అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందుతాయి."అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# కాశీ, అయోధ్య వేదికలపై ఆర్సీపురం చిన్నారుల కళావైభవం



కాశీలో శివతత్వంపై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న ఆర్సీపురం దేవిశ్రీ చైతన్యలహరి అకాడమి చిన్నారులు



కాశీలో శివతత్వంపై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న ఆర్సీపురం దేవిశ్రీ చైతన్యలహరి అకాడమి చిన్నారులు

**శివతత్వంపై కూచిపూడి నృత్యంతో అదరగొట్టిన దేవిశ్రీ చైతన్యలహరి అకాడమి చిన్నారులు**
**ప్రశంసా పత్రాలు, అవార్డులతో సత్కరించిన నిర్వాహకులు**

**ఈ–కబురు, పటాన్‌చెరు :**

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన కాశీ, అయోధ్య పుణ్య క్షేత్రాల వేదికలపై సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన చిన్నారులు తమ కళా వైభవాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. కాశీలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ నెల 5, 6 న నిర్వహించిన డ్యాన్స్ ఉత్సవ్ 2026 లో ఆర్సీపురం పట్టణానికి చెందిన దేవిశ్రీ చైతన్య లహరి కూచిపూడి అకాడమి చిన్నారులు ఉత్తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కూచిపూడి గురువు మంజాల పద్మజ ఆధ్వర్యంలో పది మంది బాలికల బృందం కాశీ, అయోధ్యలో జరిగిన ఈ కార్యక్రమంలో మన సంస్కృతి, సాంప్రదాయం, ఆధ్యాత్మికం ఉట్టిపడేలా నృత్య ప్రదర్శన అందించారు. శివతత్వాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈ కూచిపూడి ప్రదర్శన కొనసాగగా అయోధ్యలో రామాయణ, అన్నమాచార్య కీర్తనలను నృత్య రూపంలో ప్రదర్శించి అందరినీ మంత్ర ముగ్ధులను చేశారు. చిన్నారుల ప్రతిభను అభినందిస్తూ వారికి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. శ్రీసాయి నటరాజ్ ఆర్ట్స్ అకాడమీ తిరుపతి, ఆర్టిస్ ఫ్యాక్టరీ వైజాగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందని కూచిపూడి శిక్షకురాలు పద్మజ తెలిపారు. భారతీయ శాస్త్రీయ నృత్యాలను ప్రోత్సహించి, నేటితరం యువతకు నృత్యాలతో మన సంస్కృతిని తెలియజేయడమే ముఖ్య ఉద్దేశ్యమని ఆమె పేర్కొన్నారు.




చిన్నారులను అవార్డులు, ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

# ‘సిందూర్’.. ఉగ్రమూకలకు గుణపాఠం

ఈ-కబురు, : ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని, దేశ భద్రతను పరిరక్షించడంలో మన నిబద్ధతను ‘ఆపరేషన్ సిందూర్’ ప్రతిబింబించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ‘ఆపరేషన్ సిందూర్ ’కు ఏడాది పూర్తయిన వేళ ప్రధాని ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ పెట్టారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు దృఢంగా నిలబడతామని ఈ సందర్భంగా మోదీ పునరుద్ఘాటించారు. ‘‘సరిగ్గా ఏడాది క్రితం మన సాయుధ దళాలు అసమాన ధైర్యం, అంతులేని సంకల్పం, అత్యంత కచ్చితత్వంతో ‘ఆపరేషన్ సిందూర్’ చేపట్టాయి. పహల్గాంలో అమాయక భారతీయుల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రమూకలకు గట్టిగా గుణపాఠం చెప్పాయి. మన సైన్యం చూపిన శౌర్య పరాక్రమాలకు యావత్ భారతావని గర్విస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మన కఠిన వైఖరిని ఈ ఆపరేషన్ ప్రతిబింబించింది. దేశ భద్రతను పరిరక్షించుకోవడంలో మన దళాల నిబద్ధత, సంసిద్ధత, సమర్థత, సంకల్ప బలాన్ని చాటిచెప్పింది. రక్షణరంగంలో స్వావలంబన కోసం మనం చేపట్టిన ప్రయత్నాలు ఫలించి.. జాతి భద్రతకు అదనపు బలాన్ని చేకూర్చాయని ‘సిందూర్’తో స్పష్టమైంది. ఉగ్రవాదులు, వారికి మద్దతిచ్చే వారిపై ఉక్కుపాదం మోపుతూనే ఉంటాం’’ అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**‘సిందూర్’కు కొత్త లోగో..**

ఇదిలాఉండగా.. ఆపరేషన్ సిందూర్‌లో మన విజయానికి గుర్తుగా కేంద్రం కొత్త లోగోను రూపొందించింది. గతేడాది ఆపరేషన్ సమయంలో విడుదల చేసిన ‘సిందూర్’ లోగో పైన సగర్వంగా రెపరెపలాడుతున్న మన మువ్వన్నెల పతాకాన్ని జోడించింది. ఈ ఫొటోను ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు తమ సోషల్ మీడియా ఖాతాలకు డీపీగా పెట్టుకున్నారు.






# కాన్వాయ్ ఆంక్షలకు చెక్

**ఈ–కబురు, హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నిరాడంబరతను మరోసారి చాటుకున్నారు. ముఖ్యమంత్రులు.. వివిఐపిల పర్యటనల సమయంలో గంటల తరబడి సామాన్య జనం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయే సంస్కృతికి ఆయన స్వస్తి పలికారు. గురువారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం వరకు సీఎం కాన్వాయ్ ఎటువంటి ముందస్తు ట్రాఫిక్ ఆంక్షలు లేకుండా సాధారణ వాహనాల మధ్యే పయనించింది.

తన కాన్వాయ్ కోసం రోడ్లపై వాహనాలను నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని నిన్ననే ఆయన

# ఫార్మా సిటీ రైతుల పక్షాన రణం చేస్తాం

ఈకబురు,,హైదరాబాద్ :

ఫార్మా సిటీ రైతుల పక్షాన రణం చేస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో "ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది" అంశంపై గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మా సిటీ భూసేకరణ కోసం తెచ్చిన జీవో 31 ను రద్దు చేయాలన్నారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో రైతులను ఆగం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫార్మాసిటీ భూముల విషయంలో గత ప్రభుత్వం నిసిగ్గుగా అబద్దాలు చెబితే...అవే అబద్ధాలను ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందని మండిపడ్డారు. నిజం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వాలకు లేదన్నారు. ఫార్మా సిటీ భూముల విషయంలో తెలంగాణ రక్షణ సేనయే ముందుండి బాధితుల తరఫున కొట్లాడుతుందని చెప్పారు. ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించటం అనే విధానంతో తాము ముందుకు వెళ్తున్నామని... ఫార్మా సిటీ బాధిత రైతుల సమస్య పరిష్కరించే వరకు కొట్లాడుతామని స్పష్టం చేశారు.




**రైతుల భూములు తిరిగి ఇచ్చేయాలి**

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను రైతులకు వెంటనే ఇచ్చేయాలని కవిత అన్నారు. రైతుల అంగీకారం లేకుండానే వారి భూములను సేకరించారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ లో భూముల సేకరణ కోసం జీవో 31ను తీసుకొచ్చిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేస్తామని చెప్పి... అధికారంలోకి వచ్చాక రైతుల మోసం చేస్తుందన్నారు. జీవో 31 రద్దు చేయకపోగా ఫ్యూచర్ సిటీ పేరుతో భూ సేకరణను 13,500 ఎకరాల నుంచి 30 వేల ఎకరాలు చేశారన్నారు. గత ప్రభుత్వం నిసిగ్గుగా ఫార్మాసిటీ కోసం 13 వేల 5 వందల ఎకరాలు సేకరించినట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ దాంట్లో కందుకూరు మండలంలో 3500 ఎకరాలు, యాచారం మండలంలో 6500 ఎకరాలు అసైన్డ్ భూమే ఉందని కవిత చెప్పారు. వాటికి సంబంధించి కోర్టులో స్టే ఉన్న సరే బీఆర్ఎస్ ప్రభుత్వం లెక్క చేయలేదని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెబుతూ కోర్టును, ప్రజలను మోసం చేస్తుందన్నారు. కోర్టులో ఫార్మా సిటీ కొనసాగిస్తామని చెబుతూ...బయట మాత్రం రేవంత్ సర్కార్ ఫ్యూచర్ సిటీ కోసం ఈ భూముల సేకరణ మొదలు పెట్టిందని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగనిచ్చేది లేదని తేల్చిచెప్పారు.

**ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించడం మా విధానం**

మన సమస్యలు తీరాలంటే పోరాటమే శరణ్యమని కవిత అన్నారు. వేరే పార్టీల సంగతి ఎలా ఉన్న సరే తాము మాత్రం ఫార్మా సిటీ రైతుల కోసం ముందుండి కొట్లాడతామని చెప్పారు. ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించడం తమ విధానమని చెప్పారు. వెలుగుమట్లలో సమస్య పరిష్కరమయ్యే వరకు నిరాహార దీక్షకు కూర్చోవడంతోనే బాధితులకు న్యాయం జరిగిందన్నారు. మొండి ప్రభుత్వాలు దిగిరావాలంటే జగమొండిగా ఉండాల్సిందేనని కవిత స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరగాలంటే ఏం చేయాలో కలిసి కట్టుగా నిర్ణయం తీసుకోని ముందుకు వెళ్దామన్నారు. మనం గట్టిగా కొట్లాడకపోవటంతోనే కోర్టులో స్టే ఉన్న కూడా ఈ ప్రభుత్వాలు లెక్క చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం కొనసాగిద్దామని సూచించారు.

**ఫ్యూచర్ సిటీ అంతా మోసం**

ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ సర్కార్ ప్రజలందరినీ మోసం చేస్తోందని కవిత అన్నారు. బుల్లెట్ ట్రైన్ వస్తోందని, 6 లక్షల కోట్ల ఎంఓయూలు, డేటా సెంటర్లు అంటూ అబద్దాల పునాదుల మీద ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయాలనుకుంటున్నారని చెప్పారు. డేటా సెంటర్ల పేరుతో ప్రజలను కాలుష్యం కోరల్లోకి నెట్టేస్తారా అని ప్రశ్నించారు. డేటా సెంటర్ల ద్వారా వచ్చే శబ్దానికి పక్షులు బతికే పరిస్థితి ఉండదని, అమెరికా లాంటి దేశాలు డేటా సెంటర్లు పెట్టటం లేదని చెప్పారు. వాటి కారణంగా వచ్చే నష్టాన్ని ఇప్పటి వరకు ఎవరు అంచనా వేయలేదన్నారు. ఎకరాకు రూ.8 లక్షల పరిహారం మాత్రమే ఇస్తామని అంటే వారి బతుకుదెరువు పరిస్థితి ఏమిటని కవిత ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీపై ఫోకస్ పెడితే హైదరాబాద్ కోర్ సిటీ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని సూచించారు.

## పంట కొనుగోళ్లు ఎత్తివేసేందుకు మంత్రుల కమిటీ

రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా ఎత్తివేసే ప్రయత్నాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని అన్నారు. మొన్నటి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొని ఆ విషయం కూడా బయటికి చెప్పలేదన్నారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ ఏ ప్రభుత్వం కూడా ప్రజలకు నిజాలు చెప్పటం లేదన్నారు. అసలు ప్రభుత్వాలు నిజాలు చెప్పలేని పరిస్థితిలో ఎందుకు ఉన్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ సహా చాలా అంశాల్లో ప్రభుత్వం అబద్దాలు చెబుతుందన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్ లో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటి వెంట రైతులు పండించే ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదన్న మాటలు వచ్చాయన్నారు. కానీ ఈ విషయాన్ని ఏ మీడియా రాయలేదని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి పంట కొనుగోళ్లు ఉండవన్నారు. అందుకోసం ముగ్గురు మంత్రులతో రేవంత్ రెడ్డి కమిటీ వేశారని కవిత చెప్పారు. ఆ కమిటీ ఈ ఏడాది రైతుల పంట కొనుగోలు చేయాలని సూచించిందని... కానీ వచ్చే ఏడాది నుంచి పంట కొనుగోళ్లు ఉండవన్నారు. చాలా విషయాల్లో ప్రభుత్వం ఇదే విధంగా మోసాలకు పాల్పడుతుందని... ప్రజలకు నిజాలు చెప్పే దమ్ము లేదా అని కవిత పశ్నించారు.

# డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కృషి




**... డీజీపీ సీవీ ఆనంద్**

మీ స్పందన, హైదరాబాద్:

డ్రగ్స్ నియంత్రణను ప్రభుత్వం ప్రాధాన్యత అంశంగా తీసుకుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ‘‘డ్రగ్స్ మహమ్మారి వల్ల ఎన్నో కుటుంబాలు బాధపడుతున్నాయి. డ్రగ్స్ నివారణకు ఈగల్ ఫోర్స్ చాలా కృషి చేస్తోంది. మన ఈగల్ ఫోర్స్ ఇతర రాష్ట్రాలు, దేశాల్లో కూడా ఆపరేషన్స్ నిర్వహించింది. డ్రగ్స్ సరఫరాకు చెందిన ఎన్నో లింకులను ఛేదించింది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ నార్కోటిక్స్ విభాగం మంచి పనితీరు కనబరిచింది. డ్రగ్స్ కట్టడిలో జిల్లాల పోలీసు యంత్రాంగం కూడా దృష్టి సారించాలి. కాలేజీ యాజమాన్యాల బాధ్యత కూడా పెరగాలి’’ అని డీజీపీ తెలిపారు.

# ‘హంటావైరస్’ నౌక నుంచి డజను మందికి పైగా విముక్తి



**ఈ-కబురు**

ద హేగ్: ప్రాణాంతకర హంటావైరస్ గుప్పిట చిక్కిన విలాసవంత విహారనౌక ‘ఎంబీ హోండియస్’నుంచి డజను మందికిపైగా పర్యాటకులకు విముక్తి లభించింది. వ్యాధి నిర్ధారణ పరీక్షల తర్వాత వాళ్లకు వైరస్ సోకలేదని రూఢీ చేసుకున్నాక 12 దేశాలకు చెందిన డజను మందికిపైగా ప్రయాణికులను నౌక నుంచి సురక్షితంగా బయటకు పంపేశామని నౌక యాజమాన్యం, నెదర్లాండ్స్ ప్రభుత్వం గురువారం ప్రకటించింది.

అయితే లక్షణాలు కనిపించనంత మాత్రాన నౌకలోని ప్రయాణికులను స్వేచ్ఛగా వదిలేస్తారా? వాళ్లు స్వదేశాలకు వచ్చాక వాళ్లలో వైరస్ లక్షణాలు బయటపడి ఇతరులకు వ్యాపిస్తే పరిస్థితి అదుపుతప్పుతుందన్న అనుమానాలు, భయాందోళనలు ఎక్కువయ్యాయి. నౌకలోకి ఎక్కకముందు విమానంలో ప్రయాణించిన ఒక మహిళలో హంటావైరస్ లక్షణాలు వెలుగుచూశాయి. ఈమెకు ఆ విమానంలో సేవలందించిన మహిళా ఫ్లయిట్ అటెండెంట్‌ను ప్రస్తుతం క్వారంటైన్‌లో ఉంచామని, లక్షణాలు ఆమెలో ఇంకా కనిపించలేదని నెదర్లాండ్స్ వైద్యశాఖ తెలిపింది. ఏప్రిల్ 24వ తేదీన నౌకలో తొలిసారిగా వైరస్ జాడను గుర్తించిన విషయం తెల్సిందే. అయితే మార్గమధ్యంలో నౌక పలు దేశాల్లో లంగరువేయడం, అక్కడ కొందరు ప్రయాణికులు దిగిపోయిన నేపథ్యంలో ఎంతమందికి వైరస్ సోకి ఉండొచ్చనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టతలేదు.

దీంతో ప్రయాణం మొదలెట్టిన రోజు నుంచి వైరస్ వెలుగుచూసిన రోజుదాకా ఎంత మంది ఎక్కడెక్కడ దిగిపోరనే వివరాలతో వాళ్ల జాడను కనిపెట్టి వైద్యపరీక్షలు చేయడంలో ఆయా దేశాలు నిమగ్నమయ్యాయి. ఈలోపు ఈ విషయం తెలియక వాళ్లు స్థానికంగా ఇంకెంత మందికి వైరస్‌ను వ్యాపింపజేస్తారో అనే ఊహాగానాలూ ఎక్కువయ్యాయి.

# విదేశీ విద్యార్థులపై కాల పరిమితి కత్తి!

ఈకబురు,వాషింగ్టన్: అమెరికా వీసా నిబంధనలను నానాటికీ కఠినతరం చేస్తున్న ట్రంప్ సర్కారు.. అదే బాటలో మరో కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ విద్యార్థులు ఎఫ్1, జె1 వీసాలపై తమ దేశంలో ఉండే గడువు విషయంలో పరిమితులు విధించే దిశగా అది అడుగులు వేస్తోంది. తాజాగా ప్రతిపాదించిన నిబంధనలు అమల్లోకి వస్తే విద్యార్థి వీసాల గడువు పొడిగించటంలో విద్యాసంస్థల ప్రమేయం ఇంకెంతమాత్రమూ ఉండదు. ఈ విషయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులదే తుది నిర్ణయమవుతుంది. ఈ మేరకు ‘డ్యురేషన్ ఆఫ్ స్టేటస్ (డీ/ఎస్)’ వ్యవస్థను తొలగించే ప్రతిపాదనను సమీక్ష కోసం శ్వేతసౌధానికి చెందిన ‘ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ (ఓఎంబీ)’కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఈ నెల 5న సమర్పించింది. సెప్టెంబరు నుంచి ఈ నిబంధన అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి.

ప్పుడు నిబంధనలు ఎలా ఉన్నాయంటే..

గడువు పొడిగింపునకు చట్టబద్ధ కారణాలు ఉన్నాయని నిరూపించుకుంటే.. తమ ఐ20 ఫారంలో పేర్కొన్న ముగింపు తేదీ తర్వాత కూడా ఎఫ్1, జె1 వీసాదారులు అమెరికాలో కొనసాగేందుకు ‘డ్యురేషన్ ఆఫ్ స్టేటస్ (డీ/ఎస్)’ వ్యవస్థ వీలు కల్పిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ అధికారుల అనుమతి పొందనక్కర్లేదు. ఆయా విద్యార్థుల చదువు కొనసాగుతోందని స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు గుర్తిస్తే చాలు.

గడువు పొడిగింపు కోసం తమ విద్యాసంస్థలోని ‘డెజిగ్నేటెడ్ స్కూల్ అఫీషియల్ (డీఎస్‌వో)’కు విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. డీఎస్‌వో స్వయంగా నిర్ణయం తీసుకుంటారు.

ఏం మారబోతోంది?:

విద్యార్థులు అమెరికా పౌరసత్వం, ఇమిగ్రేషన్ సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్)కు దరఖాస్తు చేసుకుంటే.. ఆ అధికారులు తమ విచక్షణ ప్రకారం నిర్ణయం తీసుకుంటారు.

విద్యార్థులు అమెరికాను వీడాల్సిన తేదీని (30 రోజుల గ్రేస్ పీరియడ్‌తో కలిపి) ఐ94 ఫారమ్‌లో పేర్కొంటారు. దాన్ని పాస్‌పోర్టుతో అనుసంధానిస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తొలి ఏడాదిలో కోర్సులు/స్కూళ్లు మారడంపై నిషేధం ఉంటుంది. గ్రాడ్యుయేట్ విద్యార్థులైతే ఎప్పుడూ మారకూడదు. ముందు చదివిన కోర్సు/క్వాలిఫికేషన్‌తో సమానమైన లేదా అంతకంటే తక్కువైన రెండో డిగ్రీ/క్వాలిఫికేషన్ చదవాలనుకునేవారికి గడువు పొడిగింపు ఉండదు.

స్వల్పకాలిక ప్రోగ్రామ్‌ల (రెండేళ్ల మాస్టర్స్ వంటివి) కోసం వచ్చేవారు.. కోర్సు గడువు పూర్తవగానే అమెరికాను వీడాలి. భాషాశాస్త్ర విద్యార్థులకు సెలవులు, బ్రేక్‌లను కలిపి ఈ గడువు గరిష్ఠంగా 24 నెలలే ఉంటుంది.

పై కేటగిరీల వారంతా యూఎస్‌సీఐఎస్ నుంచి గడువు పొడిగింపు అనుమతి పొందొచ్చు.

నిజానికి కాల పరిమితి ప్రతిపాదన నిరుడే తెర మీదికి వచ్చింది. కానీ కోర్సులను సకాలంలో పూర్తిచేసే విషయంలో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు అదనపు పనిభారానికి కారణమవుతుందంటూ కళాశాలల సంఘాలు, ఆరోగ్య సేవల సంస్థలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి.

## అంతరిక్ష రంగంలో

# సరికొత్త చరిత్ర




హైదరాబాద్: భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలోని హైదరాబాద్ అంకురం స్కైరూట్ ఏరోస్పేస్ సరికొత్త ఘనతను సాధించింది. తాజాగా ఈ సంస్థ రూ.565 కోట్లు (60 మిలియన్ డాలర్లు) సమీకరించి, 'యూనికార్న్' (100 బిలియన్ డాలర్లు/రూ.9,400 కోట్లకు పైగా విలువైన సంస్థ) హోదాను సొంతం చేసుకుంది. తాజా పెట్టుబడి తర్వాత కంపెనీ విలువ రూ.10,360 కోట్ల (1.1 బిలియన్ డాలర్ల)కు చేరుకుంది. భారత అంతరిక్ష రంగంలో యూనికార్న్ స్థాయికి చేరిన తొలి ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ చరిత్ర సృష్టించింది. వచ్చే నెలలో శ్రీహరికోట నుంచి విక్రమ్-1 రాకెట్ తొలి ప్రయోగానికి సంస్థ సన్నద్ధమవుతున్న తరుణంలో, ఈ భారీ పెట్టుబడులు రావడం గమనార్హం. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో ఈ సంస్థను స్థాపించారు. 2022లో విక్రమ్-ఎస్ ప్రయోగంతో అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా పేరుపొందింది. హైదరాబాద్‌లోని 2.5 లక్షల చదరపు అడుగుల మ్యాక్స్-క్యూ, ఇన్ఫినిటీ క్యాంపస్‌లలోనే రాకెట్లను ఈ సంస్థ అభివృద్ధి చేస్తోంది.

### మూడేళ్లలోనే విలువ రెట్టింపు

ప్రముఖ టెక్ ఇన్వెస్టర్, అల్ఫాబెట్ ఇంక్ బోర్డు సభ్యుడు రామ్ శ్రీరామ్‌కు చెందిన షేర్పాలో వెంచర్స్, సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడి సంస్థ జీఐసీ సంయుక్తంగా ఈ నిధుల సేకరణకు నాయకత్వం వహించాయి. వీటితో పాటు ప్రపంచంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ బ్లాక్‌రాక్, గ్రీన్‌కో వ్యవస్థాపకులు, ఆర్కమ్ వెంచర్స్, ప్లేబుక్ పార్ట్‌నర్స్, శాంఫ్వీ ఫ్యామిలీ ఆఫీస్ వంటి ప్రముఖ పెట్టుబడిదారులు ఇందులో పాల్గొన్నారు. ఈ నిధుల సేకరణలో భాగంగా రామ్ శ్రీరామ్ స్కైరూట్ బోర్డులో చేరనున్నారు. 2023లో జరిగిన 51 మిలియన్ డాలర్ల సిరీస్-బి రౌండ్ సందర్భంగా, స్కైరూట్ విలువను 519 మిలియన్ డాలర్లు (సుమారు రూ.4,812 కోట్లు)గా పరిగణించారు. మూడేళ్లలోనే ఈ విలువ రెట్టింపు కావడం విశేషం. బ్లాక్‌రాక్ సంస్థ ఈ ఏడాది మార్చిలో స్కైరూట్‌కు రూ.100 కోట్ల రుణాన్నీ అందించింది.

### లక్ష్యం.. విక్రమ్-1

ప్రస్తుతం స్కైరూట్ కంపెనీ ప్రతిష్ఠాత్మక విక్రమ్-1 రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. మనదేశంలో ఇది తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్. ఈ ప్రయోగానికి కావాల్సిన వాణిజ్య కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు, ఒక టన్ను సామర్థ్యమున్న అధునాతన క్రయోజెనిక్ రాకెట్ విక్రమ్-2 అభివృద్ధి కోసం తాజా నిధులను వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. 350 కిలోల వరకు బరువున్న ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి చేరవేయగల ఈ రాకెట్‌ను, కొన్ని వారాల్లోనే ప్రయోగించాలనే లక్ష్యంతో సంస్థ ఉంది. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ పవన్ కుమార్ చందన మాట్లాడుతూ.. విక్రమ్-1 ప్రయోగం మనదేశంతో పాటు, అంతరిక్ష రంగానికీ కీలకమని పేర్కొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ సంస్థపై ఉంచిన విశ్వాసానికి తాజా పెట్టుబడులే నిదర్శనమని తెలిపారు. షేర్పాలో వెంచర్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ పార్ట్‌నర్ రామ్ శ్రీరామ్ మాట్లాడుతూ.. స్కైరూట్ బృందంపై తనకు పూర్తి నమ్మకముందన్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో సవాళ్లను అధిగమిస్తూ, అత్యుత్తమ ఖర్చు-పనితీరు నిష్పత్తితో భవిష్యత్తుకు అవసరమైన మౌలిక సదుపాయాలను స్కైరూట్ నిర్మిస్తోందన్నారు. ఈ ప్రయాణంలో వారితో భాగస్వామ్యం కుదుర్చుకోవడం గర్వకారణంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

# పేటీఎం లాభం రూ.183 కోట్లు

**పేటీఎం బ్రాండ్‌పై సేవలందించే ఫిన్‌టెక్ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ (పేటీఎం), మార్చి త్రైమాసికంలో రూ.183 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఈ సంస్థ రూ.545 కోట్ల నష్టాన్ని చవిచూసింది. కార్యకలాపాల ఆదాయం రూ.1,912 కోట్ల నుంచి 18.4% పెరిగి రూ.2,264 కోట్లకు చేరింది.**

చెల్లింపుల వ్యాపారం బలమైన పనితీరును కనబర్చడం, వ్యాపారవ్యక్తిగత రుణాల్లో వృద్ధి వల్లే ఈసారి పేటీఎం లాభాల్లోకి వచ్చింది. గత రెండేళ్లలోనే అత్యంత లాభదాయక త్రైమాసికంగానూ 2026 జనవరిమార్చి నిలిచినట్లు సంస్థ వెల్లడించింది. 202526 ఆర్థిక సంవత్సరంలో పేటీఎం నికర లాభం ఏకీకృత ప్రాతిపదికన
రూ.552 కోట్లుగా నమోదైంది. 202425లో రూ.663 కోట్ల నష్టాన్ని సంస్థ చవిచూసింది. కార్యకలాపాల ఆదాయం రూ.6,900 కోట్ల నుంచి 22.2% పెరిగి రూ.8,437 కోట్లకు చేరింది. ప్రస్తుత వినియోగదారులు, వ్యాపారులకు మరింత మెరుగైన సేవల అనుభూతి
కల్పించేందుకు కృత్రిమ మేధ (ఏఐ)లో కొత్త పెట్టుబడులకు ప్రాధాన్యమిస్తున్నామని పేటీఎం సీఈఓ విజయ్ శేఖర్ శర్మ తెలిపారు.
బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకునే యోచనలో సంస్థ ఉన్నట్లు వస్తున్న వార్తలను పేటీఎం కొట్టిపారేసింది. ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు కోసం తాము మరీ అంత ఉత్సుకతతో లేమని పేటీఎం ప్రెసిడెంట్, గ్రూపు సీఎఫ్ఓ మధుర్ డియోరా తెలిపారు. 'మాకు అతిపెద్ద చెల్లింపుల విపణి ఉంది. అది అభివృద్ధి చెందుతోంది.
మా మార్కెట్ వాటా కూడా పెరుగుతోంది. ఈ సేవల వ్యాప్తి ప్రస్తుతం పరిమితంగానే ఉండటంతో.. స్వల్ప, మధ్య కాలంలో మాకు వ్యాపారావకాశాలు చాలానే ఉంటాయ'ని ఆయన చెప్పారు.

# 150 ఎయిర్‌బస్ విమానాల కోసం ఎయిరేషియా భారీ ఆర్డర్


కౌలాలంపూర్: చౌక ధరల విమానయాన సంస్థ ఎయిరేషియా, ఎయిర్‌బస్ ఏ220300 మోడల్ విమానాలు 150 సమీకరించేందుకు ఆర్డర్ ఇచ్చింది. ఈ లావాదేవీ విలువ 19 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.79 లక్షల కోట్లు). ఏ220 విమానాల కోసం ఒక సంస్థ ఇచ్చిన అతిపెద్ద ఆర్డరు ఇదే. కెనడాలోని క్యూబెక్, మిరాబెల్‌లో ఉన్న ఎయిర్‌బస్ ఫ్యాక్టరీలో గురువారం ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ పాల్గొన్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన ధరలు, నిర్వహణ వ్యయాలను తట్టుకోవడానికి.. విమాన ఇంధనాన్ని సమర్థంగా వినియోగించుకునే ఏ220 విమానాలు కొనుగోలు చేయాలని ఎయిరేషియా నిర్ణయించింది. ఈ విమానాలు తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేస్తాయి. 160 సీట్ల సామర్థ్యం కలిగిన ఈ విమానాలను, తక్కువ మంది ప్రయాణికులతో కూడా లాభదాయకంగా నడపొచ్చు. చిన్న నగరాలు, సెకండరీ హబ్‌లకు విమాన సేవలు ప్రారంభించడానికి వీలుపడుతుందని సంస్థ పేర్కొంది. భవిష్యత్తులో ఈ ఆర్డరును 300 విమానాల వరకు పెంచుకునే సౌలభ్యం ఎయిరేషియాకు ఉంది.




ఈ విమానాల డెలివరీ 2028 నుంచి ప్రారంభమవుతుంది. ఆగ్నేయాసియా, ఆసియాపసిఫిక్ ప్రాంతాల్లోని గమ్యస్థానాలకు ఏ220 విమానాలను ఎయిరేషియా నడపనుంది. మధ్యస్థ దూర మార్గాలకు ఏ320, ఏ321 విమానాలను, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా వంటి సుదూర మార్గాలకు ఏ330 విమానాలను కేటాయించే అవకాశం ఉందని ఎయిరేషియా సహవ్యవస్థాపకుడు, సలహాదారు టోనీ ఫెర్నాండెజ్ పేర్కొన్నారు.
ఈ భారీ ఆర్డరుతో ఎయిర్‌బస్ ఏ220 విమానాల మొత్తం ఆర్డర్ల సంఖ్య 1,000 మార్కును దాటింది. 2026 మార్చి వరకు చూస్తే, 25 విమానయాన సంస్థలకు 501 ఏ220 విమానాలను ఎయిర్‌బస్ అందించింది.

# సూచీలకు స్వల్ప నష్టాలు

మన మార్కెట్ల నుంచి విదేశీ నిధులు స్థిరంగా తరలిపోతుండటం, పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నడుమ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో, గురువారం ఒడుదొడుకుల్లో చలించిన దేశీయ సూచీలు చివరకు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 27 పైసలు లాభపడి 94.22 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.75% తగ్గి 100.51 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సానుకూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.
ప్రధాన సూచీలు స్వల్పంగా నష్టపోయినా, బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.17 లక్షల కోట్లు పెరిగి, రూ.474.97 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
సెన్సెక్స్ ఉదయం 78,339.24 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,958.52 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,713.21 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 78,384.70 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 114 పాయింట్లు నష్టపోయి 77,844.52 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 4.30 పాయింట్లు కోల్పోయి 24,326.65 పాయింట్ల వద్ద ముగిసింది.
సెన్సెక్స్ 30 షేర్లలో 19 నష్టపోయాయి. హెచ్‌యూఎల్ 1.95%, టీసీఎస్ 1.38%, టెక్ మహీంద్రా 1.27%, టైటన్ 1.14%, ఐటీసీ 0.95% చొప్పున తగ్గాయి. ఎం అండ్ ఎం 2.14%, ఎన్‌టీపీసీ 1.46%, కోటక్ బ్యాంక్ 0.84% మేర పెరిగాయి.
రంగాల వారీ సూచీలకొస్తే ఫోకస్డ్ ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, మన్నికైన వినిమయ వస్తువులు, ఎఫ్‌ఎంసీజీ, ఇంధన రంగాలు డీలా పడ్డాయి. భారీ యంత్ర పరికరాలు, విద్యుత్, వాహన, పారిశ్రామిక, విద్యుత్, స్థిరాస్తి రంగాలు రాణించాయి.
త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో..
బజాజ్ ఆటో లాభం 93.81% పెరగడంతో, షేరు బీఎస్‌ఈలో 2.83% లాభపడి రూ.10,606.75 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 4.10% పెరిగి రూ.10,738.40 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,165.54 కోట్లు పెరిగి రూ.2,96,456.37 కోట్లకు చేరింది.
పేటీఎం షేరు 8.02% పెరిగి రూ.1,199.25 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,704.08 కోట్లు పెరిగి రూ.76,765.15 కోట్లకు చేరింది



# రుణం వడ్డీ భారం తగ్గించుకోవాలంటే

**బ్యాంకు రుణం తీసుకోవడం నేడు మధ్యతరగతి జీవితంలో ఒక భాగమైపోయింది. సొంతిల్లు, కారు, పిల్లల ఉన్నత చదువుల కోసం తీసుకునే రుణాలపై వడ్డీ రేట్లు తగ్గితే సామాన్యుడికి ఎంతో ఊరట లభిస్తుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను తగ్గించినప్పుడు ఆ ప్రయోజనం తమకు ఎప్పుడు అందుతుందా అని రుణగ్రహీతలు ఎదురు చూస్తుంటారు. అయితే, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ చేసిన వడ్డీ రేట్ల కోత ప్రయోజనాలు వినియోగదారులకు పాక్షికంగానే అందాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక తాజాగా స్పష్టం చేసింది. ఆర్‌బీఐ రేట్లు తగ్గించినప్పటికీ, బ్యాంకులు మాత్రం ఆ స్థాయిలో వడ్డీలను తగ్గించక పోవడంతో రుణగ్రహీతలకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరలేదు.**

ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు రెపో రేట్లను తగ్గిస్తూనే ఉంది. ఫిబ్రవరి 2025 నుంచి తన కీలక రెపో రేటును 6.50 శాతం నుంచి ప్రస్తుతం 5.25 శాతానికి చేర్చింది. అంటే, మొత్తంగా 125 బేసిస్ పాయింట్లు మేర కోత విధించింది. కానీ, వాస్తవంగా రుణగ్రహీతలకు అందిన ప్రయోజనం అంతంతమాత్రమే. కొత్తగా తీసుకున్న రుణాలపై సగటు వడ్డీ రేటు కేవలం 93 బేసిస్ పాయింట్లు మాత్రమే తగ్గింది. ఎంసీఎల్‌ఆర్ ఆధారిత బెంచ్‌మార్క్ రేట్లు మరింత నెమ్మదిగా కేవలం 45 బేసిస్ పాయింట్ల మేరకే తగ్గడం గమనార్హం.

వడ్డీ రేట్లు ఎందుకు తగ్గడం లేదు?
ఆర్‌బీఐ రేట్లు తగ్గించినా బ్యాంకులు వెంటనే స్పందించకపోవడానికి ప్రధాన కారణం డిపాజిట్ల ఖర్చు. బ్యాంకులు తమ లాభాలను కాపాడుకోవడానికి డిపాజిట్లపై ఇచ్చే వడ్డీని కూడా సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులు అనుసరించే రుణ విధానమూ ఇక్కడ కీలక పాత్ర పోషిస్తుంది. రెపో రేటుతో అనుసంధానించిన రుణాలకు వడ్డీ తగ్గింపు వేగంగా లభిస్తుంది. లేకపోతే నెమ్మదిగా తగ్గింపు అమలవుతుంది.

**ఏం చేయాలి?**
వడ్డీ రేట్ల కోత ప్రయోజనం మీకు సరిగ్గా అందడం లేదనిపిస్తే.. ఈ చర్యలు తీసుకోవాలి. ఎంసీఎల్‌ఆర్ నుంచి ఈబీఎల్‌ఆర్‌కు: మీ రుణం పాత ఎంసీఎల్‌ఆర్ విధానంలో ఉంటే, వడ్డీ రేటు తగ్గేందుకు చాలా సమయం పడుతుంది. దీనిని రెపో రేటుతో నేరుగా ముడిపడి ఉండే ఈబీఎల్‌ఆర్ విధానానికి మార్చుకోవడం ద్వారా ఆర్‌బీఐ తగ్గించే ప్రతి పైసా ప్రయోజనం మీకు వేగంగా అందుతుంది.
బదిలీ: తక్కువ వడ్డీ ఉన్న బ్యాంకుకు మీ రుణాన్ని బదిలీ చేసుకోవచ్చు. ఉదాహరణకు, మీరు రూ.30లక్షల గృహరుణాన్ని 8.5 శాతం నుంచి 7.63 శాతం వడ్డీకి బదిలీ చేసుకుంటే, నెలకు రూ.1,600 చొప్పున, 20 ఏళ్ల కాలపరిమితిలో దాదాపు రూ.4లక్షల వరకూ ఆదా చేసుకోవచ్చు.ఖర్చుల విషయంలో జాగ్రత్త: రుణ బదిలీ చేసేటప్పుడు కొత్త బ్యాంకు వసూలు చేసే ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఖర్చులు మీ వడ్డీ ఆదా కంటే తక్కువగా ఉన్నప్పుడే బదిలీ చేసుకోవడం ఉత్తమం.క్రెడిట్ స్కోరు: మెరుగైన సిబిల్ స్కోరున్నవారికి బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లను అందిస్తాయి. మీరు బదిలీకి దరఖాస్తు చేసే ముందు మీ క్రెడిట్ స్కోరు బాగుందని నిర్ధారించుకోండి.కాల పరిమితి: మీ రుణ కాలపరిమితి ఇంకా 1012 ఏళ్లు మిగిలి ఉన్నప్పుడే బదిలీ చేసుకోవడం వల్ల వడ్డీ ఆదా ఎక్కువగా కనిపిస్తుంది. కాలపరిమితి ముగింపు దశలో ఉంటే, ఫీజుల రూపంలో అయ్యే ఖర్చే వడ్డీ ఆదా కన్నా ఎక్కువగా ఉండొచ్చు.
ప్రస్తుతం వడ్డీ రేట్లు స్థిరీకరణ దశలో ఉన్నాయి. ఆర్‌బీఐ నుంచి మరిన్ని విధానపరమైన మార్పులు వచ్చే వరకూ వడ్డీ రేట్లలో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రుణగ్రహీతలు తమ రుణాల వడ్డీ రేట్లను ఒకసారి సమీక్షించుకొని, సరైన బెంచ్‌మార్క్ విధానాలకు మారడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు.



## బాలయ్యతో ప్రత్యేక గీతం?



అగ్ర కథానాయకుడు బాలకృష్ణ సినిమాలకీ ప్రత్యేక గీతాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంటాయి. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఆయన కొత్త చిత్రంలోనూ ప్రత్యేకగీతం ఉంటుందట. ఆ పాట కోసం కసరత్తులు మొదలైనట్టు తెలుస్తోంది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ పలువురు కథానాయికల పేర్లని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ భామ నర్గీస్ ఫక్రీ పేరు తెరపైకొచ్చింది. త్వరలోనే కథానాయిక ఎంపికని పూర్తి చేసి పాటని తెరకెక్కించనున్నట్టు సమాచారం. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా చేసుకుంటోంది. 'వీరసింహారెడ్డి' తర్వాత ఆ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు.



## దుల్కర్ ఆట ఆగస్టులో

'ఐ యామ్ గేమ్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు దుల్కర్ సల్మాన్. ఆయన నటించిన ఈ 40వ సినిమాని నహాస్ హిదాయత్ తెరకెక్కించారు. దుల్కర్, జోమ్ వర్గీస్ నిర్మించారు. కయాదు లోహర్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే దీన్ని ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు దుల్కర్ సల్మాన్ వెల్లడించారు. "నేనప్పటి వరకు చేసిన సినిమాల్లో అత్యంత స్టైలిష్ చిత్రమిది. దీంట్లో దర్శకుడు నహాస్ నన్ను ఓ కొత్త అవతారంలో చూపించారు. ఇందులో నా పాత్రతో పాటు కథ ప్రపంచమంతా చాలా ఆధునికంగా ఉంటుంద"ని తెలియజేశారు. దుల్కర్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఒకేసారి విడుదల కానుంది.

# నేను కాకుండా వేరొకరైతే బాగుండేది





ఏక్ దిన్' సినిమాను అంగీకరించడానికి ఆమిర్ ఖాన్‌తో ఉన్న అనుబంధమే ముఖ్య కారణమని అంటోంది సాయి పల్లవి. ఆమె, జునైద్ ఖాన్ జంటగా నటించిన చిత్రమిది. ఆమిర్ నిర్మాణంలో రూపొందిన ఈ ప్రేమకథా చిత్రం ఇటీవలే విడుదలై ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సాయి పల్లవి ఈ సినిమా గురించి మాట్లాడింది. "ఈ చిత్రాన్ని ఒప్పుకోవడానికి స్క్రిప్ట్ కూడా మరో కారణం. చిత్రబృందం నన్ను సంప్రదించిన సమయంలో నేను చాలా ఎమోషనల్ సినిమాల్లో నటిస్తున్నాను. అందుకే మనసుకు హాయిగా అనిపించే పాత్రలు చేయాలనుకున్నా. ఈ కథ విన్నప్పుడు నాకు 'బిఫోర్ సన్‌రైజ్' అనే హాలీవుడ్ సినిమా గుర్తొచ్చింది. ఆ చిత్రమంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఈ ప్రాజెక్ట్‌కి ఒకే చెప్పా. ప్రీమియర్ షో చూసిన తర్వాత ఈ పాత్రకు నేను సరిపోలేదని నాకు అనిపించింది. దీని కోసం నన్ను కాకుండా మరొకరిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదని ఆమిర్‌తో చెప్పా" అని చెప్పుకొచ్చింది సాయి పల్లవి. ఆకర్షించే పాత్రలతో అలరించే ఈ తార.. తొలి హిందీ చిత్రమిదే కావడం విశేషం.

## కార్తితో మీనాక్షి?


కథానాయకుడు కార్తి తెలుగులో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' విజయాలతో అందర్నీ మెప్పించిన కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. ఇది గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైనట్లు తెలిసింది. కల్యాణ్ శైలికి తగ్గట్లుగా ఓ సరికొత్త వినోదాత్మక కథతోనే ఈ చిత్రం ముస్తాబు కానుందని సమాచారం. దీంట్లో మీనాక్షి చౌదరి కథానాయికగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కానుంది. దీన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇక ప్రస్తుతం కార్తి నటించిన 'సర్దార్ 2' నిర్మాణానంతర పనుల్లో ఉండగా.. 'మార్షల్' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది.





# అడవిలో ప్రియాంక పోరు

'ది బ్లఫ్'లో ఇటీవలే సముద్రపు దొంగ పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని అదరగొట్టింది కథానాయిక ప్రియాంక చోప్రా. ఇప్పుడామె ఓ సర్వైవల్ థ్రిల్లర్‌తో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ప్రియాంక, ఓర్లాండో బ్లూమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రీసెట్'. మాట్ స్మక్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ హాలీవుడ్ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది ప్రియాంక. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. "ఆకర్షణ, అనుమానం రెండూ ఏకకాలంలో కనిపించే జంట కోసం నేను వెతికాను. ప్రియాంక, ఓర్లాండో ఈ పాత్రలకు వంద శాతం న్యాయం చేయగలరని నమ్ముతున్నాను. వారి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంద"న్నారు. అడవిలో చిక్కుకున్న ఓ మహిళ చేసే పోరాటం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని, ఆగస్టులో దీన్ని పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారని చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రియాంక 'వారణాసి'తో బిజీగా ఉంది.



## సినిమా చూశాకా 'లవ్ యూ నాన్న' అనాల్సిందే



'గోదారి గట్టుపైన' సినిమా చూసి బయటకొచ్చిన ప్రతి అమ్మాయి కచ్చితంగా వాళ్ల నాన్నకి ఫోన్ చేసి 'లవ్ యూ నాన్న' అని చెప్తారు. అలాంటి అందమైన భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి'' అన్నారు హీరో సుమంత్ ప్రభాస్. ఆయన.. నిధి ప్రదీప్ జంటగా నటించిన ఈ సినిమాని సుభాష్ చంద్ర తెరకెక్కించారు. పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. జగపతిబాబు, లైలా కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ రోజు థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ.. ''మనుషుల మధ్య ఉండే అందమైన అనుబంధాల్ని, భావోద్వేగాల్ని దర్శకుడు సుభాష్ ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. ఓ తండ్రి తన కూతుర్ని మిస్ అవుతున్న సందర్భం గురించి ఆలోచిస్తే కళ్లలో నీళ్లు తిరుగుతాయి'' అన్నారు. ''మా బాబాయ్ నుంచి స్ఫూర్తి పొంది చేసిన చిత్రమిది. తనూ కూతుర్ని ఎక్కువగా ప్రేమించే తండ్రే. ఆ పాత్రనే దీంట్లో జగపతిబాబు పోషించారు'' అన్నారు దర్శకుడు

## భారీ కుంభకోణంలో బాబీదేబల్

మెరిసే తారల మధ్య రాక్‌స్టార్‌గా మంచి జీవితాన్ని గడుపుతున్నాడు ఓ టీవీ స్టార్. కానీ ఆ మెరుపులు ఎన్నో రోజులు లేవు. కొందరు ఆయన్ని ఓ భారీ కుంభకోణంలో ఇరికించి.. జైలుకెళ్లేలా చేశారు. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది తెలుసుకోవాలంటే 'బందర్' సినిమా చూడాల్సిందే. హీరో, ప్రతినాయక పాత్రలతో మెప్పిస్తున్న బాబీ దేఒల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం.. జూన్ 5న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇన్‌స్టా వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మెరిసే జాకెట్, తళతళలాడే సన్ గ్లాసెస్ ధరించి.. గిటార్ పట్టుకున్న బాబీని స్టైలిష్‌గా చూపిస్తూ మొదలైన ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తిగా సాగుతోంది. సన్యా మల్హోత్రా, సబా ఆజాద్, జితేంద్ర జోషి, రాజ్ బి.శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషించారు. నిఖిల్ ద్వివేది నిర్మించారు.



## భువీకి బుమ్రాకు అదే తేడా



దిల్లీ: ఒక గేమ్ ప్లాన్‌కు కట్టుబడి ఉండకపోవడం వల్లే బుమ్రా ఈ ఐపీఎల్‌లో ప్రభావం చూపించలేకపోతున్నాడని.. మరోవైపు భువనేశ్వర్ కుమార్ కచ్చితమైన ప్రణాళికతో సఫలమయ్యాడని టీమ్‌ఇండియా సీనియర్ పేసర్ ఉమేశ్ యాదవ్ అన్నాడు. ‘‘భువనేశ్వర్ కుమార్ ప్రణాళిక చాలా స్పష్టంగా ఉంది. అతడు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున పవర్ ప్లే, డెత్ ఓవర్లలో మాత్రమే బౌలింగ్ చేస్తున్నాడు. భువి వికెట్‌కు రెండు వైపులా స్వింగ్ చేస్తూ వికెట్లు తీస్తున్నాడు. మరోవైపు బుమ్రా ఈ సీజన్లో స్థిరంగా రాణించలేకపోతున్నాడు. అతడు కొన్నిసార్లు మాత్రమే పవర్ ప్లేలో బౌలింగ్ చేస్తున్నాడు. మరి కొన్నిసార్లు ఒత్తిడి లేని సమయంలో బంతి అందుకుంటున్నాడు. అదే అతడిపై ప్రభావం చూపిస్తోంది. ముంబయి.. బుమ్రాకు వికెట్లు తీసే అవకాశాలు కల్పించాలి’’ అని ఉమేశ్ పేర్కొన్నాడు. రిషబ్ పంత్ ఫామ్‌లో లేకపోవడం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను దెబ్బ తీస్తోందని ఉమేశ్ అన్నాడు. ‘‘లఖ్‌నవూ సరైన మేళవింపుతో బరిలో దిగట్లేదు. బ్యాటింగ్ ఆర్డర్ విఫలమవుతోంది. ప్రతి మ్యాచ్‌లో బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చుకుంటూ పోతున్నారు. ముఖ్యంగా పంత్ రాణించలేకపోతున్నాడు. ఇది జట్టును దెబ్బ కొడుతోంది. టీ20ల్లో గెలవాలంటే సమష్టిగా రాణించాలి’’ ఉమేశ్ తెలిపాడు.

## ఆసియా క్రీడలకు వినేశ్ దూరం



దిల్లీ: పునరాగమనం చేద్దామనుకున్న భారత సీనియర్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు నిరాశ. ఈ నెలాఖరులో జరగనున్న 2026 ఆసియా క్రీడల ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) విడుదల చేసిన ప్రమాణాల ప్రకారం వినేశ్‌కు అవకాశం లేకుండా పోయింది. 2025 జాతీయ సీనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్, 2026 సీనియర్ ఫెడరేషన్ కప్, అండర్20 జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ టోర్నీల్లో పతకాలు గెలిచిన వారు మాత్రమే ఎంపిక పోటీలకు అర్హులని డబ్ల్యూఎఫ్ఐ పేర్కొంది. అయితే వినేశ్ 2024 పారిస్ ఒలింపిక్స్ తర్వాత బరిలో దిగలేదు. బిడ్డకు జన్మనివ్వడం వల్ల గత ఏడాది పోటీలకు దూరమైంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండా నగరంలో ఆదివారం నుంచి మొదలుకానున్న జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో ఆమె పాల్గొననుంది. మాజీ డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ సింగ్ నుంచి వేధింపులు ఎదుర్కొన్నానంటూ, అతడికి పట్టున్న గోండాలో ఈ పోటీలు నిర్వహించడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ వినేశ్ ఓ వీడియో విడుదల చేసిన కొద్ది రోజుల్లోనే ఈ నిబంధనలు వెలువడడం గమనార్హం. మరోవైపు వినేశ్ తిరిగి రెజ్లింగ్‌లోకి రావాలంటే.. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిబంధనకు లోబడి ఉండాలి. వాడా నియమాల ప్రకారం రిటైర్ అయిన అథ్లెట్లు పునరాగమనం చేయాలనుకున్నప్పుడు.. తాము డోపింగ్ పరీక్షలకు సిద్ధంగా ఉన్నట్లు ఆరు నెలలు ముందుగానే సంబంధిత అంతర్జాతీయ సమాఖ్యకు గానీ జాతీయ డోపింగ్ నిరోధక సంస్థకు గానీ లిఖితపూర్వకంగా సమాచారం అందించాల్సి ఉంటుంది. ఆమె ఈ ప్రక్రియ పూర్తి చేసిందో లేదో స్పష్టత లేదు.

## చాహల్ వేపింగ్ ప్రాంక్



దిల్లీ: ఈ ఐపీఎల్ సీజన్లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేస్తూ కనిపించడం సంచలనం రేపింది. తాజాగా భారత లెగ్ స్పిన్నర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు చాహల్ విమాన ప్రయాణంలో ఇసిగరెట్ తాగుతున్నట్లు కనిపించిన వీడియో ఒకటి బయటకు రావడంతో సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పంజాబ్ కింగ్స్ జట్టు అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న సమయంలో పేసర్ అర్ష్‌దీప్‌సింగ్ చిత్రీకరించిన ఒక వ్లాగ్‌లో చాహల్ వేపింగ్ పరికరాన్ని వాడుతున్నట్లుగా రెండు చేతులు నోటి దగ్గర పెట్టుకున్నాడు. తర్వాత చేతులు దూరంగా తీసేటప్పుడు నోటికి సమీపంగా పొగ వచ్చింది. నిజానికి అతడు వేపింగ్ చేయలేదు.. సరదాగా చేసిన పనిలో భాగంగా స్ప్రేను కొట్టడంతో అది పొగలా కనిపించింది. అతడు వేపింగ్ చేశాడా అన్నట్టుగా ఉన్న ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అవుతోంది.

## గుకేశ్ గేమ్ డ్రా



వార్సా (పోలెండ్): గ్రాండ్ చెస్ సూపర్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నిలకడగా రాణిస్తున్నాడు. అయిదో రౌండ్లో సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)పై గెలిచి మంచి లయలో ఉన్న అతడు.. ఆరో రౌండ్లో వెస్లీ సో (అమెరికా)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. అతడు ప్రస్తుతం ఆరు పాయింట్లతో ఉన్నాడు. ఖాతాలో 9 పాయింట్లు ఉన్న వెస్లీ సో, హ్యాన్స్ నీమన్ (అమెరికా) ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ర్యాపిడ్ విభాగంలో మరో మూడు రౌండ్లు మిగిలున్నాయి.


# లఖ్‌నవూ గెలిచింది

–ఆరు ఓటముల తర్వాత విజయం
–మార్ష్ మెరుపు శతకం
–విజృంభించిన ప్రిన్స్
–ఆర్సీబీ పరాజయం

**ప్లేఆఫ్స్ ఆశలు దాదాపుగా లేనట్లే.. అన్నీ గెలిచినా ముందుకెళ్తుందన్న గ్యారంటీ లేదు.. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో పరాజయంపాలైంది. అలాంటి జట్టు ఐపీఎల్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడిస్తుందా? గెలుపు సహజంగా ఆర్సీబీదే అని అంతా అనుకున్నారు.. కానీ ఎవరూ ఊహించని విధంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయాన్ని అందుకుంది. మిచెల్ మార్ష్ సెంచరీతో మెరిసిన వేళ విజయం సొంతం చేసుకున్న లఖ్‌నవూ సాంకేతికంగా ఇంకా ప్లేఆఫ్స్ రేసులో నిలిచింది.**

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కాస్త ఉపశమనం. వరుస ఓటములతో తల్లడిల్లిన ఆ జట్టు ఎట్టకేలకు విజయాన్నందుకుంది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. మిచెల్ మార్ష్ (111; 56 బంతుల్లో 9×4, 9×6) మెరుపు శతకం బాదడంతో మొదట లఖ్‌నవూ 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. పూరన్ (38; 23 బంతుల్లో 4×4, 1×6), పంత్ (32 నాటౌట్; 10 బంతుల్లో 4×4, 2×6) రాణించారు. డక్‌వర్త్ లూయిస్ విధానంలో లక్ష్యాన్ని 213 పరుగులకు సవరించగా ఛేదనలో ఆర్సీబీ తడబడింది. 6 వికెట్లకు 203 పరుగులే చేయగలిగింది. రజత్ పాటీదార్ (61; 31 బంతుల్లో 3×4, 6×6) టాప్ స్కోరర్. టిమ్ డేవిడ్ (40; 17 బంతుల్లో 4×4, 3×6) రాణించాడు. ప్రిన్స్ యాదవ్ (3/33), షాబాజ్ అహ్మద్ (2/33) ఆర్సీబీని దెబ్బతీశారు.

**బెంగళూరు తడబాటు:**
ఛేదనలో ఆరంభం ఆర్సీబీకి పెద్ద షాక్. 9 పరుగులకే ఓపెనర్లు బెతెల్ (4), కోహ్లి (0) నిష్క్రమించారు. బెతెల్‌ను షమి వెనక్కి పంపగా.. కోహ్లిని ప్రిన్స్ యాదవ్ బౌల్డ్ చేశాడు. ఆ దశలో కెప్టెన్ పాటీదార్, పడిక్కల్ నిలిచారు. పడిక్కల్ చక్కని షాట్లు ఆడాడు. నిలదొక్కుకోవడానికి సమయం తీసుకున్న పాటీదార్.. క్రమంగా చెలరేగిపోయాడు. ధనాధన్ షాట్లతో సిక్స్‌లు బాదేస్తూ జోరుగా పరుగుల వేట సాగించాడు. దిగ్వేశ్ రాఠి, మయాంక్ యాదవ్ ఓవర్లలో రెండేసి సిక్స్‌లు బాదాడు. పాటీదార్ 26 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. 10 ఓవర్లలో 104/2తో ఆర్సీబీ బలమైన స్థితిలో నిలిచింది. అయితే ఆ జట్టు సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న దశలో 8 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టి లఖ్‌నవూ బలంగా పోటీలోకి వచ్చింది. పైచేయిలో నిలిచింది. ప్రిన్స్ ఒకే ఓవర్లో పడిక్కల్ (34), జితేశ్ శర్మలను ఔట్ చేసి ఆర్సీబీని గట్టి దెబ్బతీశాడు. జోరుమీదున్న పాటీదార్‌ను షాబాజ్ వెనక్కి పంపాడు. 112/5తో బెంగళూరు చిక్కుల్లో పడింది. ఆ తర్వాత ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన టిమ్ డేవిడ్‌ను 16వ ఓవర్లో షాబాజ్ ఔట్ చేశాడు. గెలవాలంటే ఆఖరి 3 ఓవర్లలో ఆర్సీబీ 47 పరుగులు చేయాల్సిన స్థితి. ఆ దశలో కృనాల్ విధ్వంసక బ్యాటింగ్‌తో లఖ్‌నవూను కలవరపెట్టాడు. కానీ ఆర్సీబీకి ఓటమి తప్పలేదు.





**దంచేసిన మార్ష్:**
లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో మార్ష్ ఆటే హైలైట్. చెలరేగి ఆడిన అతడు ఆ జట్టు బలమైన లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించాడు. లఖ్‌నవూ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. మార్ష్ ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17; 24 బంతుల్లో 1×4) పరుగుల కోసం కష్టపడ్డా, షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డా.. మార్ష్ మాత్రం విధ్వంసక షాట్లతో విరుచుకుపడ్డాడు. హేజిల్‌వుడ్ ఓవర్లో స్ట్రెయిట్ సిక్స్‌తో మొదలైంది మార్ష్ జోరు. అదే ఓవర్లో అలాంటిదే బౌలర్ తలమీదుగా అతడు మరో సిక్స్ బాదేశాడు. భువనేశ్వర్, కృనాల్ పాండ్యలనూ మార్ష్ వదల్లేదు. విధ్వంసం కొనసాగిస్తూ రసిఖ్ సలామ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టాడు. హేజిల్‌వుడ్ ఓవర్లో మూడు బంతులను బౌండరీ దాటించాడు. ఈ క్రమంలో మార్ష్ 20 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం విశేషం. మరో వైపు అర్షిన్ సింగిల్స్ కూడా ఎక్కువగా తీయలేకపోయాడు. ఎదుర్కొన్న తొలి 22 బంతుల్లో అతడు 17 పరుగులు మాత్రమే చేశాడు. అయినా మార్ష్ మెరుపుల కారణంగా లఖ్‌నవూ 9 ఓవర్లలో 95/0తో బలమైన స్థితిలో నిలిచింది. ఆ దశలో వర్షం కారణంగా చాలా సమయం వృథా అయింది. తిరిగి ఆట మొదలయ్యాక అర్షిన్ ఔట్ కాగా.. మార్ష్ వీర బాదుడును కొనసాగించాడు. బలమైన షాట్లతో అలరించిన అతడు.. షెపర్డ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో సెంచరీ (49 బంతుల్లో) పూర్తి చేశాడు. మరోవైపు పూరన్ నిలిచాడు. అయితే లఖ్‌నవూ 14 ఓవర్లలో 145/1తో ఉండగా వర్షం తిరిగి మొదలైంది. మళ్లీ సమయం వృథా అయింది. ఓ ఓవర్‌ను తగ్గించారు. మార్ష్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేసినా.. పంత్ విరుచుకుపడడంతో ఆఖరి మూడు ఓవర్లలో లఖ్‌నవూ 44 పరుగులు రాబట్టింది. హేజిల్‌వుడ్ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదిన పంత్.. ఆఖరి ఓవర్లో, సలామ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6తో మెరుపు ముగింపునిచ్చాడు. పూరన్ చివరి ఓవర్లో వెనుదిరిగాడు. అతడు మార్ష్‌తో రెండో వికెట్‌కు 70, పంత్‌తో మూడో వికెట్‌కు 29 పరుగులు జోడించాడు.

**లఖ్‌నవూ ఇన్నింగ్స్:**
మిచెల్ మార్ష్ (సి) బెతెల్ (బి) హేజిల్‌వుడ్ 111; అర్షిన్ కులకర్ణి (సి) పాటీదార్ (బి) కృనాల్ 17; పూరన్ (సి) కృనాల్ (బి) రసిఖ్ సలామ్ 38; పంత్ నాటౌట్ 32; మార్‌క్రమ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (19 ఓవర్లలో 3 వికెట్లకు) 209; వికెట్ల పతనం: 195, 2165, 3194; బౌలింగ్: భువనేశ్వర్ 4-0-34-0; హేజిల్‌వుడ్ 40491; కృనాల్ 4-0-31-1; రసిఖ్ సలామ్ 4-0-53-1; సుయాశ్ శర్మ 2-0-21-0; షెపర్డ్ 1-0-16-0

**బెంగళూరు ఇన్నింగ్స్:**
బెతెల్ (సి) ప్రిన్స్ (బి) షమి 4; కోహ్లి (బి) ప్రిన్స్ 0; పడిక్కల్ (సి) అండ్ (బి) ప్రిన్స్ 34; పాటీదార్ (సి) మార్‌క్రమ్ (బి) షాబాజ్ 61; జితేశ్ (సి) పంత్ (బి) ప్రిన్స్ 1; డేవిడ్ (సి) దిగ్వేశ్ (బి) షాబాజ్ 40; కృనాల్ నాటౌట్ 28; షెపర్డ్ నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 12, మొత్తం: (19 ఓవర్లలో 6 వికెట్లకు) 203; వికెట్ల పతనం: 19, 29, 3104, 4106, 5112, 6158; బౌలింగ్: షమి 40331; ప్రిన్స్ యాదవ్ 4-0-33-3; మయాంక్ 4-0-50-0; దిగ్వేశ్ 4-0-50-0; షాబాజ్ 3-0-33-2

# 10,000 అదనపు టికెట్లు కోరిన కేఎస్‌సీఏ

దిల్లీ: ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ నిర్వహణ రేసు నుంచి బెంగళూరును తప్పించడానికి గల కారణాలను బీసీసీఐ వెల్లడించింది. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) నిబంధనలకు విరుద్ధంగా భారీ సంఖ్యలో ఉచిత (కాంప్లిమెంటరీ) టికెట్లను డిమాండ్ చేయడంతో చిన్నస్వామి స్టేడియానికి అవకాశం దక్కలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపాడు. ఐపీఎల్ ప్రోటోకాల్ ప్రకారం స్టేడియం మొత్తం సామర్థ్యంలో 15 శాతం టికెట్లను మాత్రమే ఆతిథ్య రాష్ట్ర సంఘానికి ఉచితంగా కేటాయిస్తారు. ‘‘అన్ని రాష్ట్రాల సంఘాలకు ఇదే ప్రామాణికం. అయితే ఐపీఎల్ లీగ్ మ్యాచ్‌ల సమయంలో కేఎస్‌సీఏ నిర్ణీత 15 శాతం కోటా కంటే చాలా ఎక్కువ కోరుతున్నట్లు మాకు సమాచారం అందింది. దీనిపై వివరణ కోరుతూ బోర్డు పంపిన ఈమెయిల్‌కు కేఎస్‌సీఏ ఇచ్చిన సమాధానం బీసీసీఐని షాక్‌కు గురిచేసింది. కేఎస్‌సీఏ తన లేఖలో 15 శాతం కోటాకు అదనంగా తమ సభ్యులు, అనుబంధ క్లబ్‌లు, ఇతరుల కోసం భారీ సంఖ్యలో టికెట్లు కావాలని కోరింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడం మమ్మల్ని మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. వీటితో పాటు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి మరో 700 ఉచిత టికెట్లు కావాలని అడిగింది. నిబంధల ప్రకారం వచ్చే టికెట్ల కంటే సుమారు 10,000 అదనంగా కావాలని పట్టుబట్టింది’’ అని సైకియా వివరించాడు. కేఎస్‌సీఏ డిమాండ్‌లకు తలొగ్గని బీసీసీఐ.. ఫైనల్ నిర్వహణ బాధ్యతను అహ్మదాబాద్‌కు అప్పగించింది. ప్లేఆఫ్ మ్యాచ్‌లు ధర్మశాల, చండీగఢ్‌లలో జరగనున్నాయి.

**బెంగళూరు సామర్థ్యం తక్కువ: ఐపీఎల్ ఛైర్మన్**
బెంగళూరు సామర్థ్యం తక్కువగా ఉండటం వల్లే ఐపీఎల్ ఫైనల్‌ను అహ్మదాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు లీగ్ ఛైర్మన్ అరుణ్‌సింగ్ ధూమల్ తెలిపాడు. సాధారణంగా గత ఏడాది విజేత జట్టు సొంత మైదానంలోనే తర్వాతి సీజన్ ఫైనల్ నిర్వహించడం ఆనవాయితీ. ‘‘అహ్మదాబాద్ స్టేడియం ప్రపంచంలోనే పెద్దది. 1.30 లక్షల మందికి పైగా ప్రేక్షకులకు వసతి కల్పిస్తుంది. బెంగళూరు స్టేడియం సామర్థ్యం 40,000 మాత్రమే. ఐపీఎల్ ఫైనల్‌ను వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు తరలివస్తారు. ఎక్కువ మందికి అవకాశం కల్పించేందుకు పెద్ద వేదిక అవసరం. లీగ్ మ్యాచ్‌లకే బెంగళూరులో టిక్కెట్ల కొరత ఏర్పడింది. ఫైనల్ మ్యాచ్ సమయంలో ఐసీసీ బోర్డు సమావేశం కూడా ఉంది. ఈ భేటీకి విదేశాల నుంచి చాలామంది సభ్యులు, ప్రతినిధులు హాజరవుతారు. అంతర్జాతీయ అతిథుల సౌకర్యం, వారికి తగినన్ని టిక్కెట్లు అందుబాటులో ఉంచేందుకు అహ్మదాబాద్ సరైన వేదిక అని బీసీసీఐ భావించింది’’ అని ధూమల్ వివరించాడు.



# కొరియాను పడగొట్టి ఫైనల్లో భారత్

షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 2లో భారత మహిళల రికర్వ్ జట్టు సంచలనం సృష్టించింది. పదిసార్లు ఒలింపిక్ ఛాంపియన్ దక్షిణ కొరియాకు భారత్ షాకిచ్చింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో దీపిక కుమారి, అంకిత భకత్, కుంకుమ్ మొహొద్‌లతో కూడిన భారత్ 51తో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. ఈ టోర్నీలో తొలి పతకాన్ని ఖాయం చేసింది. కీలక పోరులో నాలుగో సీడ్ భారత్ ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి సెట్‌లో నాలుగు 10లు సహా మొత్తం 58 పాయింట్లు సాధించిన భారత్.. దక్షిణ కొరియా (55)పై ఒత్తిడి పెంచింది. రెండో సెట్‌లో 5656తో స్కోరును సమం చేసి 31తో ఆధిక్యంలో నిలిచింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో భారత ఆర్చర్లు 58 పాయింట్లతో సత్తాచాటారు. 56 పాయింట్లకే పరిమితమైన దక్షిణ కొరియాకు ఓటమి తప్పలేదు. ఆదివారం ఫైనల్లో రెండో సీడ్ చైనాతో దీపిక బృందం తలపడనుంది. మరోవైపు భారత పురుషుల జట్టుకు చుక్కెదురైంది. తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్ బొమ్మదేవర, యశ్‌దీప్ భోగేలతో కూడిన భారత బృందం 26తో బంగ్లాదేశ్ చేతిలో ఓడింది. మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ నిరాశ ఎదురైంది. రెండో రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర అంకిత భకత్ జోడీ 45 (1919)తో బ్రెజిల్ జంట చేతిలో పరాజయం చవిచూసింది. తొలుత స్కోర్లు సమం కాగా.. షూటాఫ్‌లో లక్ష్యానికి అత్యంత సమీపంగా బాణం సంధించిన బ్రెజిల్ విజేతగా నిలిచింది.



## ఆసీస్ ప్లేయర్లు ఐపీఎల్‌లోనే..

మెల్‌బోర్న్: పాకిస్థాన్‌తో ఈనెల 30న మూడు వన్డేల సిరీస్ ఆరంభం కాబోతున్నా.. కెప్టెన్ కమిన్స్‌తో పాటు మిగిలిన ప్లేయర్లు ఐపీఎల్‌లో కొనసాగుతారని క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. ఐపీఎల్‌లో లీగ్ దశ ఈనెల 24న పూర్తి కానుండగా.. ఫైనల్ 31న జరగనుంది. ఆస్ట్రేలియా ప్లేయర్లు కమిన్స్, ట్రావిస్ హెడ్ (సన్‌రైజర్స్ హైదరాబాద్), హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్ (లఖ్‌నవూ సూపర్ జెయింట్స్), బార్ట్‌లెట్, స్టాయినిస్, కూపర్ కనోలీ (పంజాబ్ కింగ్స్), మాథ్యూ షార్ట్ (చెన్నై సూపర్ కింగ్స్), స్టార్క్ (దిల్లీ క్యాపిటల్స్), కామెరూన్ గ్రీన్ (కోల్‌కతా నైట్‌రైడర్స్) ఐపీఎల్‌లో ఆడుతున్నారు. పాయింట్ల పట్టికలో వెనుకబడిన లఖ్‌నవూ, దిల్లీ, కోల్‌కతా ముందంజ వేయడం కష్టం కనుక లీగ్ దశ ముగిశాక స్టార్క్, గ్రీన్, మిచెల్ మార్ష్, ఇంగ్లిస్ స్వదేశానికి బయల్దేరే అవకాశాలున్నాయి. సన్‌రైజర్స్, ఆర్సీబీ, పంజాబ్‌కు ప్లేఆఫ్స్ అవకాశాలు ఉండడంతో కమిన్స్, హెడ్, డేవిడ్, హేజిల్‌వుడ్, కనోలీ.. భారత్‌లోనే ఉండడం దాదాపు ఖాయం. బంగ్లాదేశ్‌తో జూన్ 9న ఆరంభమయ్యే వన్డే సిరీస్‌కు పూర్తి స్థాయి ఆస్ట్రేలియా జట్టు అందుబాటులో ఉండే అవకాశాలున్నాయి.